క్లుప్తంగా

నీట్ ఫలితాలు రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల విడుదలైన నీట్ యూజీ ఫలితాలను రద్దు చేయాలని పీడీ ఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీష్, గణేష్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ ఫలితాలు తప్పుల తడకగా ఉన్నాయన్నారు. 67 మంది విద్యార్థులు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్‌ను సాధించినట్లు నీట్ ప్రకటించిందన్నారు. ఇందులో ఎనిమిది మంది విద్యార్థులు ఒకే సెంటర్‌కు చెందినవారే ఉన్నారని తెలిపారు. పాట్నా, గుజరాత్, అనేక ప్రాంతాల్లో పేపర్ లీక్ అయ్యిందని ఆరోపించారు. పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, వెంటనే పరీక్ష ఫలితాలను రద్దు చేయాలన్నారు.

చల్లబడిన వాతావరణం

బోథ్: మండల వ్యాప్తంగా ఆదివారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. వేసవిలో మండుటెండలకు ఉక్కపోతకు గురైన ప్రజలు గత రెండు రోజులు కురిసిన మోస్తారు వర్షానికి వాతావరణ చల్లబడటంతో ఉపశమనం పొందారు. కాగా రైతులు విత్తనాలు విత్తడానికి సిద్ధమవుతున్నారు.

సర్వీసు రోడ్డు బాగు చేయండి



గుంతలమయంగా సర్వీస్ రోడ్డు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భీంపూర్ ఎస్సైగా మహ్మద్ కలీం



మహ్మద్ కలీం

తాంసి: భీంపూర్ ఎస్సైగా ఆదివారం మహ్మద్ కలీం బాధ్యతలు స్వీకరించారు. బదిలీ ల్లో భాగంగా భీంపూర్ ఎస్సైగా పనిచేస్తున్న ప్రదీప్ కుమార్‌ను పోలీస్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న మహ్మద్ కలీంను భీంపూర్‌కు బదిలీ చేశారు. శాంతి భద్రతల అదుపునకు కృషి చేస్తానని తెలిపారు.

ఒకరి అదృశ్యం

నేరడిగొండ: మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన మంద ఉదయ్ (23) శనివారం సాయంత్రం నుంచి కనిపించడం లేదంటూ ఆయన తండ్రి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కనిపించడం లేదని, బంధువులకు ఫోన్ చేసి తెలుసుకున్నప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు. దీంతో ఆదివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కంకర తొలగించాలి



కంకర చూపుతున్న రైతు

తాంసి: వంతెన నిర్మించి పూర్తయిన తరువాత రాళ్లు, కంకర, ఇసుక తొలగించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నానని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. భీంపూర్ మండలంలోని కరంజి(టి), గుబిడి గ్రామాల మధ్య రాకపోకలకు కరంజి(టి) వాగుపై గతేడాది వంతెన నిర్మాణం చేపట్టారు. నిర్మాణ సమయంలో వాగును అనుకొని ఉన్న కర్నేవార్ శంకర్ పంటచేల్లో గుత్తేదారు నిర్మాణ సామగ్రితో పాటు మెటీరియల్ ఉంచి నిర్మాణ పనులు చేపట్టారు. వంతెన పూర్తయినప్పటికీ పంటచేనులో నుంచి వాటిని తొలగించలేదు. తొలగించకపోతే వంతెన పైనుంచి రాకపోకలు నిలిపివేస్తానని రైతు హెచ్చరించాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంటచేనలో వేసిన తాత్కాలిక రోడ్డుతో పాటు కంకర తొలగించాలని బాధిత రైతు కోరుతున్నారు.

నీటి సమస్యలు తన దృష్టికి తీసుకురావాలి

ఖానాపూర్: పట్టణంలో నెలకొన్ని నీటి సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో స్థానిక డబుల్‌బెడ్‌రూం కాలనీకి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న చైర్మన్ ఆదివారం దగ్గరుండి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సాగునీరు అందేదెప్పుడో?

- అసంపూర్తిగా కాలువల నిర్మాణం
- అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం
- రూ 4.50 కోట్ల ప్రజాధనం వృథా



నిలిచిన కాలువ పనులు



నిరుపయోగంగా మారిన అడేగామ(కె) చెరువు

ఇచ్చోడ: అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. 19 ఏళ్లుగా చెరువు కాలువ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సాగునీరు కోసం ప్రభుత్వం వెచ్చించిన ప్రజాధనం వృథా అవుతోంది. రైతుల అవసరాలు తీర్చే సాగు నీటి పథకాలు అలంకారప్రాయంగా మారాయి. మంలదంలోని అడేగామ(కె) శివారులో 2005లో అప్పటి వైఎస్ ప్రభుత్వ హయాంలో జలయజ్ఞం కింద రూ 2.5 కోట్లతో చెరువు నిర్మించారు. అడేగామ(కె) అడేగామ(బి), కోకస్‌మన్నూర్ గ్రామాల పరిధిలోని 8 వందల ఎకరాలకు సాగునీరు అందేలా నిర్మించారు. కానీ రెవెన్యూ, నీటిపారుదల శాఖ, కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో 19 ఏళ్లుగా నిరుపయోగంగా మారింది.

అసంపూర్తిగా కాలువ నిర్మాణం..

2005లో మంజూరైన చెరువు పనులు ఏడాదిలో పూర్తియ్యాయి. వెంటనే కాలువల పనులు పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. 2016లో రెండోవిడత మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా చెరువు నుంచి 3 కిలో మీటర్ల మేర కాల్వ నిర్మాణం కోసం అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. పనులు సైతం ప్రారంభించారు. కానీ కాలువ నిర్మాణం అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారని, తన పొలం పక్క నుంచి కాలువ నిర్మాణం కోసం సర్వే చేశారని అడేగామ(కె) గ్రామానికి చెందిన రైతు పనులను అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ సదరు రైతు పొలంలో వంద మీటర్ల పొడవున కాలువ తవ్వకుండా వదిలేశాడు. అక్కడి నుంచి మరో రెండు కిలో మీటర్ల పొడువు కాలువ నిర్మాణం పూర్తి చేశారు. రైతు అడ్డుకున్న పొలంలో వంద మీటర్ల కాలువ నిర్మాణం జరుగకపోవడంతో రూ 4.50 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన చెరువు ద్వారా చుక్క సాగు నీరు రైతులకు అందడం లేదు. రైతు అడ్డుకున్న వంద మీటర్ల కాలువ పనులు పూర్తయితే 8 వందల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశాం



కాలువ పనులు రైతు అడ్డుకోవడంతో కాంట్రాక్టర్ పనులను వదిలేసి వెళ్లారు. ఈ విషయంపై ఆదిలాబాద్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశాం. వారు ల్యాండ్ అలైన్‌మెంట్ ద్వారా చర్యలు తీసుకుంటే, కాంట్రాక్టర్ ద్వారా పనులు చేపట్టే విధంగా చూస్తాం.

– భీంరావు, డీఈ, చిన్న నీటిపారుదలశాఖ

గుంతల రోడ్డుతో అవస్థలు



గుంతలమయంగా బోథ్ ఎక్స్‌రోడ్డు

- రూ. 4 కోట్ల నిధులు మంజూరు
- కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకోకపోవడంతో నిధులు వెనక్కి

బోథ్: బోథ్ మండల కేంద్రం ఎక్స్‌రోడ్డు గుంతలమయంగా మారింది. బోథ్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఎక్స్‌రోడ్డు నుంచి బోథ్‌కు వచ్చే దారిలో పలుచోట్ల గుంతలు ఉండడం, రోడ్డు కొంత మేర పాడవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు గత సంవత్సరం రెన్యూవల్ కింద రూ. 4కోట్ల నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రతిపాదనలు పరిశీలించిన ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను విడుదల చేసింది. కానీ కాంట్రాక్టర్ పనులు చేసేందుకు అగ్రిమెంట్ చేసుకోలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

బిల్లులు ఆలస్యం..

తాము చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడం, ప్రభుత్వం వెనువెంటనే బిల్లులు మంజూరు చేయకుండా నెలల తరబడి ఆలస్యం చేయడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గతంలో తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. కాగా బోథ్ నుంచి బోథ్ ఎక్స్‌రోడ్డు వరకు 10 కిలో మీటర్ల మేర రెన్యూవల్ కింద బీటీరోడ్డు వేయడానికి గత సంవత్సరం రూ. 4 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినా.. బిల్లులు సరైన సమయానికి వస్తాయో? రావోనని సదరు కాంట్రాక్టర్ పనులకు సంబంధించి అగ్రిమెంట్ చేసుకోలేదు. దీంతో ఆర్థిక సంవత్సరం ముగియడంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. గతంలో తాము చేసిన పనులకే బిల్లులు రావడం లేదని, ప్రస్తుతం అగ్రిమెంట్ చేసుకుని పనులు చేస్తే బిల్లులు వచ్చే గ్యారంటీ లేదని సదరు కాంట్రాక్టర్ వాపోయినట్లు తెలుస్తోంది.

నిధుల మంజూరుకు మళ్లీ ప్రతిపాదనలు..

గత సంవత్సరం రూ. 4 కోట్ల నిధులు మంజూరై, పనులు జరగకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. అయితే ఆర్అండ్‌బీ అధికారులు ఈఏడాది నిధుల మంజూరుకు మళ్లీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఈసారైనా పనులు చేయాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.

రోడ్డు పనులు చేయాలి



రోడ్డు పనులను పూర్తి చేయాలి. వచ్చిన నిధులు వెనక్కి వెళ్లడం దురదృష్టకరం. మళ్లీ నిధులు కేటాయించి, పనులు చేయాలి. రోడ్డు గుంతలుగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– జక్కుల వెంకటేశ్, బోథ్

ప్రతిపాదనలు పంపించాం

రెన్యూవల్ కింద బోథ్ నుంచి ఎక్స్‌రోడ్డు వరకు 10కిలోమీటర్ల మేర పనులకు రూ. 4 కోట్ల నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపిచాం. గతేడాది కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రాలేదు. నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో, ఈ ఏడాది మళ్లీ నిధులు కేటాయించాలని నివేదించాం.

–సునీల్, ఆర్అండ్‌బీ, డీఈ

ఆయుష్మాన్ భారత్‌తో మెరుగైన వైద్యం

కైలాస్‌నగర్: పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే సదుద్దేశంతో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో కొత్తగా పలు చికిత్సలను చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి ప్రకటనలో అన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో చేరడంతో పాటు మరిన్ని వైద్య సేవలకు అవకాశం కల్పించేలా ఆరోగ్యశ్రీని విస్తరించడంపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నో సార్లు విన్నవించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌లో చేరకపోవడంతో ఎంతో మంది పేదలు వైద్యం కోసం లక్షలు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆయుష్మాన్ భారత్‌లో చేరడంతో పేద ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు.

‘చరిత్రను తిరగరాశాం’



మాట్లాడుతున్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేని విధంగా 77వేలకు పైగా ఓట్లు సాధించి చరిత్ర తిరగరాశామని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలందరి కృషితోనే ఇదీ సాధ్యమైందన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల, ముఖ్యనాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. బూత్‌లవారీగా వచ్చిన ఓట్లపై సమీక్షిస్తూ అందుకోసం కృషి చేసిన శ్రేణులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ఎక్కడ వైఫల్యం చెందామో అక్కడే మన సత్తా చాటాలని దిశానిర్దేశం చేశారు. 77వేల ఓట్లు సాధించడం వెనుక అందరి కృషి, పట్టుదల, అలుపెరగని శ్రమ ఉందన్నారు. పట్టణంలోనూ తిరుగులేని పట్టు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కొన్ని వార్డుల్లో ఆధిక్యం కనబర్చామన్నారు. ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, వెంకట్ రెడ్డి, ఆశమ్మ, గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, చరణ్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



సంబురాలు జరుపుకొంటున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. టపాసులు కాల్చి, హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీతోనే సుపరిపాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, అర్జున్, నిఖిల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయడంతో మోదీ కటౌట్‌తో సంబురాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, తాక్రే విలాస్, బర్కాడే రాము, ధర్నే జీవన్, తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తలమడుగు: మండలంలోని దేవపూర్ గ్రామంలో మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేయడంతో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దాతాజీ కిరణ్, శానం శ్రీనివాస్, రేగుల మోహన్, ఆడెపు శ్రీనివాస్, శ్రీపతి నగేశ్, రవి, అశోక్, నారాయణ, సాయి శీను, విలాస్, ప్రభాకర్, రాహుల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జవాన్‌కు ఘన స్వాగతం



ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నార్నూర్: హైదరాబాద్‌లోని ఆర్మీ ట్రైనింగ్ సెంటర్‌లో ఏడు నెలలు శిక్షణ పూర్తి చేసుకొని ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న ఆర్మీ జవాన్ తోర్కడ్ రాజ్‌కుమార్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ పెద్దలు మెస్రం శేఖర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని ఒక మారుమూల గ్రామం నుంచి కష్టపడి ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన రాజ్‌కుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్, గ్రామస్తులు పాండురంగ్, గోవింద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని బుద్ధనగర్‌కు చెందిన కాలే గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ఆదివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, జితెందర్, సర్కాలే శివాజీ, మస్కే రాజువర్ధన్ ఉన్నారు.

బిర్సాముండా ఆశయాలు కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇచ్చోడ: నేటి యవత బిర్సాముండా ఆశయాలను కొనసాగించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ అన్నారు. ఆదివారం బీర్సాముండ 124 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండల కార్యదర్శి సిడం మురళీకృష్ణ, ప్రధాన్ సమాజ్ డివిజన్ అధ్యక్షుడు గెడం నాగేందర్, మడావి భీంరావు, సోయం విశ్వనాథ్, ఆత్రం గంగారాం, పెందుర్ మహేందర్, సోయం రాములు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు



నేరడిగొండ: పూజలు చేస్తున్న గ్రామస్తులు

బోథ్: సొనాల గ్రామంలో ఆదివారం గ్రామస్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా మేకలను గ్రామ దేవతలకు బలిచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఇర్ల నడిపి బాపు, కొండ ముత్తన్న, కాని మురళి, సుభాష్ సూర్య, రామగిరి శ్రీనివాస్, బోరె రవీందర్, బంటు జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మర్లపెల్లి గ్రామంలో

బోథ్ మండలంలోని మర్లపెల్లి గ్రామంలో గ్రామదేవతలకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. గ్రామంలోని పోచమ్మకు బోనాలు సమర్పించారు. మేకలను బలిచ్చారు. నేరేడుపల్లె వెళ్లే దారిలో దేస భీమన్నకు ప్రత్యేక పూజలు చేశారు.

నల్లపోచమ్మకు మొక్కులు

నేరడిగొండ: పాడి పంటలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆదివారం మండలంలోని వడూర్ గ్రామస్తులు నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకొని, నైవేద్యం సమర్పించారు.

కంచె ఏర్పాటు చేయండి సారూ!



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. డైట్ కళాశాల మైదానంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచార సమయంలో సీఎం సభ నిర్వహించిన సమయంలో క్రీడా ప్రాంగణానికి సంబంధించిన కంచెను తొలగించారు. అయితే ఇప్పటి వరకు కంచెను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దీంతో క్రీడా ప్రాంగణం రహదారిని తలపిస్తోంది. పక్కనే క్రీడా ప్రాంగణం గేటు మూసి ఉన్నా.. కంచె లేకపోవడంతో ప్రాంగణంలోని వ్యాయామ పరికరాలకు రక్షణ కరువైంది.

‘ప్రజలకు అండగా ఉంటా’



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: ప్రజలకు అండగా ఉంటూ.. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుతానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తన నివాసంలో మాట్లాడారు. తన గెలుపు కోసం మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన కృషి మరువలేనిదన్నారు. పార్టీ కోసం పనిచేయాలని కొంత మంది తప్పిదాల వల్ల ఓటమి చవి చూడటం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ప్రజల మధ్య ఉంటూ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఖయ్యూం, చంద్రయ్య, ఎక్బాల్, ఎస్పీ రెడ్డి, రాధాబాయి పాల్గొన్నారు.

నిత్యాన్నదానం పునః ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో నిత్యాన్నదాన కార్యక్రమం తిరిగి ప్రారంభమైంది. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి గత కొన్ని రోజులుగా తన క్యాంపు కార్యాలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా నిలిపివేశారు. ఇటీవల కోడ్ ముగియడంతో ఆదివారం తిరిగి పుఃన ప్రారంభించారు. పలువురు పేదలకు ఆయన స్వయంగా భోజనాన్ని వడ్డించారు. సోమవారం నుంచి ఎప్పటిలాగే యథావిధిగా ఉచిత నిత్యాన్నదానం కొనసాగనుందన్నారు.